క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



గంగలకుర్రు వసతి గృహంలో వంట గదిని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రులో ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వసతి గృహంలో కిటికీలకు ఉన్న మెస్‌లు సక్రమంగా లేవని వాటి వల్ల దోమలు లోపలికి వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. తక్షణమే మెస్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వంట చేసే ప్రాంత మంతా శుభ్రంగాగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు సమయ పాలన పాటిస్తూ విద్యతో పాటు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ నెల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మామిడికుదురు: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శనివారం పాశర్లపూడిలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి వీటిని అందజేశారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. నలుగురికి రూ.రెండు లక్షల విలువైన చెక్కులను అందించారు. సర్పంచ్ అడబాల తాతకాపు, సొసైటీ చైర్మన్ మంద గాంధీ, బోణం బాబు, మెండా ఆదినారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రత అందరి బాధ్యత

అంబాజీపేట: బాలికలకు అన్ని విధాలా అండగా నిలవడంతో పాటు, వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. అప్పారావు మాట్లాడుతూ బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని పిలుపునిచ్చారు. బాలికలకు రక్షణ కల్పించడంతో పాటు వారికి చక్కని చదువు, ఆరోగ్యం అందించాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని బాలికలు సమాజంలో గౌరవించబడాలంటే బాగా చదువుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని శనివారం విశ్వేశ్వరాయపురం పాఠశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వ హక్కులు సాధించాలంటే అసమానత అనే సంక్షోభాన్ని విద్య ద్వారానే తొలగించాలన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం

మామిడికుదురు: నగరం గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆరు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది చేపట్టనున్న పంచ పరివర్తనపై ప్రధానంగా ప్రస్తావించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహకార్య వాహ్ దొంగ రామ్మోహన్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానంగా సమరసత, కుటుంబ విలువలు, స్వదేశీ వస్తువుల ఆదరణ, పౌర సేవలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తుందన్నారు. సమావేశంలో జాలెం సుబ్బారావు పాల్గొన్నారు.

అల్లుడికి 105 రకాల స్వీట్లతో విందు



పెదపట్నంలంకలో అల్లుడికి ఏర్పాటు చేసిన 105 రకాల స్వీట్లు, కూల్‌డ్రింకులు

మామిడికుదురు: ఇంటి అల్లుడికి అత్తింటి వారు పుట్టిన రోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. 105 రకాల స్వీట్లు, పలు రకాల డ్రింకులు, ఐస్ క్రీములతో పసందైన విందును ఏర్పాటు చేసి పుట్టిన రోజు గుర్తుండిపోయేలా చేశారు. పెదపట్నంలంకలో శనివారం కుంపట్ల శ్రీనివాస్, పద్మావతి దంపతులు తమ అల్లుడు కోట ఉదయకుమార్ బర్త్‌డే సందర్భంగా ఈ విందు ఏర్పాటు చేశారు. సంప్రదాయానికి ప్రాధాన్యం ఇస్తూ అరిటాకులో ఈ స్వీట్లను వడ్డించి అల్లుడితో తినిపించారు. బర్త్‌డేకు హాజరైన వారు ఈ విందును చూసి ఎంతో ముచ్చట పడ్డారు. పుట్టిన రోజును చిరకాలం గుర్తుండిపోయేలా చేశారంటూ పొగడ్తలతో ముంచెత్తారు.

నదీ కోత.. తీరని వెత

- ఈ ఏడాది వరుసగా నాలుగు సార్లు వరద
- నదీగర్భంలో కలసిపోతున్న లంక భూములు
- ఆందోళనలో లంక పరివాహక రైతులు



బడుగువానిలంకలో గోదావరి వరద ధాటికి నదీ గర్భంలో కలసిపోతున్న లంక భూములు

ఆలమూరు: గౌతమీ గోదావరికి ఏటా సంభవిస్తున్న వరదల వల్ల ఎంతో విలువైన లంక భూములు నదీ గర్భంలో కలసి పోతున్నాయి. బంగారు పంటలు పండించే లంకభూములు కోతకు గురవుతుంటే రైతన్నల గుండె తరుక్కు పోతుంది. ఆలమూరు మండలంలో మడికి, బడుగువానిలంక, చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, ఆలమూరు గ్రామాలు లంక పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. అయితే బడుగువానిలంక ద్వీపం మాదిరిగా గోదావరిలో అంతర్భాగంగా నది ఒడ్డున ఉంది. గోదావరికి ఎప్పుడు వరదలు సంభవించినా బడుగునివానిలంకపై ప్రధానంగా ప్రభావం చూపుతుంది. గత దశాబ్దకాలంలో ఆగ్రామానికి చెందిన సుమారు 800 ఎకరాల భూములు నదీగర్భంలో కలసిపోయాయి. ఆ గ్రామ వాసుల సమస్యలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సుమారు రూ.2.5 కోట్లతో గ్రోయిన్లు నిర్మించారు. అలాగే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఓఎన్జీసీ సహకారంతో రూ.42 కోట్లతో మళ్లీ గ్రోయిన్లు నిర్మించడం జరిగింది.

ఎక్కువ సార్లు వరదలు సంభవించడం వల్లే..

గోదావరికి మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది వరుసగా నాలుగు సార్లు వరదలు సంభవించడంతో పాత, కొత్త గ్రోయన్ల కలయిక మధ్యలో ఊబి సంభవించి చిన్నపాటి లీకేజీ ఏర్పడింది. దీంతో ఈ ఏడాది మళ్లీ వరద ప్రవాహ వేగానికి లంక భూముల కోత మొదలైంది. బర్మా సొసైటీ (రెడ్లు లంక)కు చెందిన రెండు ప్రదేశాల్లో నదీ కోత విపరీతంగా జరిగింది. కేవలం ఈనెలలోనే అరటి, దొండ, గులాబీ వంటి పంటలతో ఉన్న ఈ భూములు కళ్లముందే కొట్టుకుపోతుంటే రైతులు మనోవేదనకు గురి కావాల్సిన పరిస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే లంక భూములు తర్వాత జిరాయితీ భూములతో పాటు బడుగువానిలంక గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్తులు మనోవేదన చెందుతున్నారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత లీకేజీని అరికట్టడంతో పాటు గ్రామ పరిధిలోని మిగతా లంక భూముల వెంబడి మళ్లీ గ్రోయిన్ల పనులు చేపట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అక్టోబర్ నెలలోనూ సంభవించిన వరద

గోదావరికి సాధారణంగా జూలైలో ప్రారంభమయ్యే వరద నీరు సెప్టెంబర్ రెండో వారానికి పూర్తిగా తగ్గుముఖం పడుతుంది. ఒక్కో సందర్భంలో నీరు రంగు మారడం కూడా జరుగుతుంది. అయితే ఈఏడాది గోదావరికి అక్టోబర్ మొదటి వారం వరకూ ఏకధాటిగా కూడా వరదలు సంభవించడం వల్లే గ్రోయిన్లు దెబ్బతిన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద స్థాయికి వరద నీరు చేరుకోకపోయినా వరద మాత్రం విపరీతంగా పోటెత్తింది. ఈ ఏడాది సరాసరిన రోజుకు ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీటిని ఆగస్టు మూడో వారం నుంచి ఇప్పటి వరకూ సముద్రంలోకి వదిలిపెడుతూనే ఉండటం వరద తీవ్రతను సూచిస్తుంది. ఇలా ఇన్ని రోజులు పాటు నిండు గోదావరి ప్రవహించిన సందర్భాలు లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

పి.గన్నవరం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోతవరం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి సమావేశానికి గన్నవరపు అధ్యక్షత వహించారు. కోటి సంతకాల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసకారి చంద్రబాబు పేద వర్గాలకు చెందిన మెడికల్ విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారని, పేద రోగులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే సంపద సృష్టిస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలోని గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి 60 వేల సంతకాలు సేకరించనున్నట్టు గన్నవరపు వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరాజు, సీనియర్ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని వైఎస్సార్ సీపీ ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుంటుందన్నారు. మండల శాఖల అధ్యక్షులు యన్నాబత్తుల ఆనంద్, కొమ్ముల రాము, విత్తనాల ఇంద్రశేఖర్, మేడిశెట్టి శ్రీను, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి తాతాజీ, దొమ్మేటి సత్యమోహన్, మిండగుదిటి శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



పోతవరంలో కోటి సంతకాల ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలి



జి.నరేష్

ఆలమూరు: నేటి సమకాలీన సమాజంలో సాంకేతిక అభివృద్ధి చెందుతున్న విధంగానే రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ఎస్సై జి.నరేష్ సూచించారు. ఆలమూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబర్ నేరాలు–తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని మోసాలకు గురికాకుండా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొరియర్ల పేరుతో ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. అలాగే చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతోను, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తరహా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే సత్వరమే 1930 నంబరు డయల్ చేసి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల సోషల్ మీడియాలోని వాట్సాప్ వేదికగా ఎస్‌బీఐ, రైతు భరోసా వంటి సేవా కేంద్రాలకు ఏపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమంటూ ఫోన్‌కాల్స్ వస్తున్నాయని ఎస్సై నరేష్ వివరించారు. ఆయాప్‌లో ఆధార్‌కార్డు, పాన్‌కార్డ్‌ను లింక్ చేసుకునే విధంగా సైబర్ నేరగాళ్ల మభ్యపెట్టి ఫోన్ హ్యాక్ చేసి వ్యక్తిగత డేటాను దొంగలిస్తూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి ఆకర్షణకు లోనై మోసపోకూడదని యువతకు సూచించారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి ఎక్కువగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేసుకుని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

విద్యావ్యవస్థ నాశనం



తాడి సహదేవ్

మలికిపురం: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి తాడి సహదేవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మలికిపురం పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతూ బి.కొత్తకోటలోని రిషి వాటికా గురుకులంలో మూడేళ్లగా చదువుతున్న అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లికి చెందిన విద్యార్థి శేషాద్రి రెడ్డిపై ఫీజు చెల్లించలేదని దాడి చేయడం దారుణమన్నారు. ఫీజు చెల్లించాలని శేషాద్రిరెడ్డి తండ్రికి గురుకులం సిబ్బంది సమాచారం ఇవ్వగా.. రెండు రోజుల్లో చెల్లిస్తానని తండ్రి అమరనాథ్‌రెడ్డి చెప్పారని వివరించారు. కానీ ఫీజు విషయమై విద్యార్థి శేషాద్రిరెడ్డితో వాగ్వాదానికి దిగిన గురుకులం సిబ్బంది రాయితో కంటిపై దాడి చేయడం దాంతో తీవ్ర రక్త స్రావం అయిందన్నారు. కుమారుడికి చికిత్స అనంతరం బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేసినా కానీ స్పందన కరువైందన్నారు. దాంతో హోం మంత్రి, డీజీపీ, హోం సెక్రటరీకి ఫిర్యాదు చేశారన్నారు. విద్యా వ్యవస్థను 15 నెలల్లోనే ఇలా సర్వ నాశనం చేసేశారన్నారు. సరైన వాటర్, ఆహారం పెట్టలేకపోతున్నారని సహదేవ్ పేర్కొన్నారు.

బాణసంచా కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేయాలి

పి.గన్నవరం: మండలంలోని వాడ్రేవుపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ శనివారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, తహసీల్దార్ పి.శ్రీవల్లవి, జిల్లా ఫైర్ అధికారి పార్థసారథి తదితరులతో కలసి బాణసంచా తయారీ యూనిట్‌ను, అక్కడ సేఫ్టీ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లేనందున బాణసంచా తయారీ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేయాలని ఆర్డీఓ శ్రీకర్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై బి.శివకృష్ణ, ఆర్ఐ వెన్నపు దాంగే, అగ్నిమాపక కేంద్ర అధికారులు ఉన్నారు.

బాణసంచా హోల్‌సేల్ కేంద్రాల తనిఖీ

కొత్తపేట: రాయవరం మండలం కొమరిపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో ఈ నెల 8 న భారీ విస్ఫోటనం సంభవించి 8 మంది మరణించిన నేపథ్యంలో జిల్లాలో పీఎస్ స్థాయిలో ఎస్సై నుంచి రేంజ్ స్థాయిలో ఐజీ వరకూ పోలీసు అధికారులు బాణసంచా తయారీ కేంద్రాలు, దీపావళి హోల్‌సేల్ షాపులను నిరంతరం విస్తృతంగా తనిఖీ చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే రెవెన్యూ, పోలీస్, ఫైర్, కార్మిక శాఖల అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలకు తనిఖీల బాధ్యతలు అప్పగించారు. శనివారం కార్మిక శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టి.నాగలక్ష్మి, స్థానిక తహసీల్దార్ వై.రాంబాబు, ఎస్సై జి.సురేంద్ర, ఎస్ఎఫ్ఓ పి.శ్రీనివాస్ సంయుక్తంగా మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలను, దీపావళి బాణసంచా హోల్‌సేల్ షాపులను శనివారం తనిఖీ చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? యజమానులు, పనిచేసే సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారా? వంటి అంశాలు పరిశీలించారు. ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు, వెలుతురు భద్రత ఉండాలని, ఆయా కేంద్రాల యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తరచూ తనిఖీలు జరుగుతుంటాయని, నిబంధనలు, జాగ్రత్తలు పాటించడంలో ఏమాత్రం నిర్లక్ష్య ధోరణి కనిపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కొత్తపేటలో హోల్‌సేల్ షాపు వద్ద యజమానులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు



వాడ్రేవుపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ శ్రీకర్, డీఎస్పీ మురళీమోహన్

నిత్యాన్నదానానికి విరాళాలు



సుధేష్ణదేవికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి నరసాపురానికి చెందిన కుడుపూడి సుధేష్ణదేవి రూ.15,111, మండలంలోని చింతనలంకకు చెందిన విల్లా మౌళి మణికుమార్‌లు రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామి ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాలసేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



నల్లచెరువు వేంకటేశ్వరస్వామికి నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు

స్వామి సన్నిధిలో సినీనటుడు సునీల్



అంతర్వేది ఆలయంలో స్వామి లడ్డూ ప్రసాదం అందుకుంటున్న సునీల్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ కమిటీ సలహాదారుడు అనంతశయన దీక్షితులు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అలాగే స్వామివారికి ప్రముఖ సినీనటుడు సునీల్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సునీల్‌కు స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రసాదం పంపిణీని పరిశీలిస్తున్న ఈవో సత్యకుమార్

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈవోగా సత్యకుమార్ శనివారం అమలాపురంలో బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ అన్నదాన సమాజంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సత్యకుమార్ పదోన్నతిపై ఇక్కడికి ఈవోగా బదిలీపై వచ్చి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ముగ్గురు శానిటరీ సిబ్బందికి షోకాజ్ నోటీసు

అమలాపురం టౌన్: అమలాపురంలో పారిశుద్ధ్య పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న శానిటరీ మేస్త్రీ, వార్డు సచివాలయ పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి, కార్మికుడిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ షోకాజ్ నోటీసులను శనివారం జారీ చేశారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద అన్న క్యాంటీన్ సమీపంలోని ఓ ఫ్రూట్ జ్యూస్ షాపు ముందు శానిటరీ మేస్త్రీ, వార్డు సచివాలయ పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికుడు చెత్తను పట్టుకుని వచ్చి వేసిన వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో శనివారం హల్‌చల్ చేయడంతో కమిషనర్ తొలుత వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ షాపు యాజమానిని వీరు డబ్బులు డిమాండ్ చేసినట్లు, ఆయన ఇవ్వకపోవడంతో షాపు ముందు చెత్త వేసినట్లు ఆరోపణలున్నాయి. షోకాజ్ నోటీసులు అందుకున్న 48 గంటల్లో వివరణ ఇవ్వాలని కమిషనర్ సూచించారు. వారి వివరణ ఆధారంగా తదుపరి చర్యలు, విచారణ నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. షాపు ముందు పేరుకుపోయిన చెత్త విషయంలో జరిగిన వివాదం కారణంగానే తాము చెత్త పోశామని శానిటరీ మేస్త్రీ చెబుతున్నారు.



అమలాపురంలో షాపు ముందు కార్మికుడు చెత్త పోస్తున్నట్టు సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద 13న నిరసన

అమలాపురం రూరల్: తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమ మాదిరిగా అన్ని ప్రాంతాల్లో తయారుచేసి ప్రజల ప్రాణాలను హరిస్తోంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమలాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వివిధ విభాగ సభ్యులు ముఖ్య నాయకులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, జిల్లా నాయకులు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరసనలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

పలువురికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న జంపన బుజ్జిరాజు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు తమ ఫౌండేషన్ ద్వారా మంజూరు చేసిన నగదు మొత్తాలను శనివారం అందించారు. మలికిపురంలోని ఫౌండేషన్ స్థానిక ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా అందించారు. తాడి పెద్దిరాజు, కొణిదెల రమేష్, నల్లి కిషన్ కింగ్, చొప్పల కుమారరత్నం తలా రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.40 వేలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. చైర్మన్ వెంకటరామరాజుకు బాధితులు, వారి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లిలో శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. దేవస్థానం ఈఓ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ.1,24,155, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.24,176తో కలిపి మొత్తం రూ.1,48,331 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.


కంటి సమస్యలను అశ్రద్ధ చేయవద్దు



పెదపళ్లలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆలమూరు: కంటి సంబంధిత సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలని ప్రముఖ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఎల్‌వీ ప్రసాద్ వైద్యుడు ఎస్ఎస్ఎన్ మహావీర్ అన్నారు. మండలంలో పెదపళ్లలోని ఎస్‌బీపీబీకే సత్యనారాయణ కమ్యూనిటీ హాలులో కపిలేశ్వరపురానికి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఫ్రీడం ఆయిల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫ్రీడం ఆయిల్ ప్రతినిధి అంజలి రజదాన్ ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి అనేక మంది కంటి సంబంధిత వ్యాధిగ్రస్తులు విచ్చేసి పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. అందులో 72 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించగా సుమారు పది మందికి శస్త్రచికిత్స చేయించేందుకు ఎంపిక చేశారు. సర్పంచ్ ఏడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, కార్యదర్శి వి.వేణి, ఏడిద మెహెర్ ప్రసాద్, నెక్కంటి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఎస్‌ఏ డివిజన్ ఉపాధ్యక్షుడిగా రామరాజు



ఏపీఆర్‌ఎస్‌ఏ డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామరాజు

సఖినేటిపల్లి: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమలాపురం డివిజన్ ఉపాధ్యక్షుడిగా సఖినేటిపల్లికి చెందిన మండల ఆర్ఐ వేగిరాజు వెంకట రామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం అమలాపురంలో డివిజన్ స్థాయిలో జరిగిన నూతన కార్యవర్గ ఎంపికలో ఈ మేరకు రామరాజును డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కాగా రామరాజుకు సఖినేటిపల్లి, రాజోలు తహసీల్దార్లు ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్ భాస్కర్, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేవీఎస్ ప్రభాకరచార్యుల నేతృత్వంలో పురోహితుల బృందం అందించిన తొలి హారతి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. నవ జనార్దన ఆలయాల్లో ఒకటైన ఈ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఇటీవల ఆలయంలో నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణలకు విశేష ప్రాచుర్యం రావడంతో ఆలయాన్ని దర్శించుకునే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. దాతల సహకారంతో ఇప్పటికే ఆలయంలో అనేక మౌలిక సదుపాయాలను దేవదాయశాఖ ఏర్పాటు చేసింది. ఆలాగే మండలంలోని చింతలూరు, నర్సిపూడి, గుమ్మిలేరు, జొన్నాడ, సంధిపూడి, గ్రామాల్లో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.